క్లుప్తంగా

ఆంప్లిఫయర్ అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ శ్రీ శుక్రవారం దేవి ఆలయానికి రోటరి క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంప్లిఫయర్‌ను అందజేశారు. గతంలో ఆలయంలో ఏర్పాటు చేసిన ఆంప్లిఫయర్ చోరీకి గురైంది. ఇది గమనించిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్ తన సొంత ఖర్చులతో ఆంప్లిఫయర్‌ను అందజేశారు. క్లబ్ కార్యదర్శి రాస ఆనంద్, మాజీ అధ్యక్షుడు పుష్కాకర్ రావు, పీఏజీ చరణ్ రెడ్డి, మాజీ కార్యదర్శి వేల్పుల లక్ష్మీనారాయణ, ఖాందేశ్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



కమ్మర్‌పల్లి: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కమ్మర్‌పల్లి మండల పశు వైద్యాధికారి రాజశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం ఉప్లూర్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించి 72 గోజాతి, 109 గేదె జాతి పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవాలు గాలికుంటు వ్యాధి బారిన పడడం వల్ల నోటిలో పుల్లతో చొంగ కారడం, కాలి డెక్కలలో పగుళ్లు ఏర్పడి నడవలేకపోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, అబార్షన్లు అవడం వంటి లక్షణాలు ఏర్పడతాయన్నారు. ప్రతి పశువుకు ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

గోశాల ఆవులకు టీకాలు..



రుద్రూర్: మండల కేంద్రంలోని దేవిదాస్ రావు గోశాలలో ఆవులకు శుక్రవారం ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 89 ఆవులకు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి సంతోష్ తెలిపారు. గోశాల ప్రతినిధులు బచ్చు రాం సేట్, ఇందూరు చంద్రశేఖర్, సతీష్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ డి.సాయిరాజ్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోతంగల్ మండలంలో..

పోతంగల్ మండలం తిర్మలాపూర్‌లో శుక్రవారం వెటర్నరి సిబ్బంది పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వెటర్నరీ వైద్యుడు సురేష్, వెటర్నరీ అసిస్టెంట్ సుధీర్ ఎల్ఎస్ఏ లక్ష్మి, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

జిల్లా జడ్జి సునీతకు సన్మానం



ఖలీల్ వాడి: జిల్లా జడ్జి సునీతా కుంచాల పెద్దపల్లి జిల్లాకు బదిలీ అయిన సందర్భంగా జిల్లా న్యాయాధికార సేవా సంస్థ సమావేశ మందిరంలో న్యాయవాదులు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. మూడున్నరేళ్లలో జిల్లా ప్రజలతో మమేకమై న్యాయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, డిఫెన్స్ కౌన్సిల్స్ రాజ్‌కుమార్ సుబేదార్, ఉదయ్ కృష్ణ, ప్రమోద్, విశ్వక్ సేన్ పాల్గొన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాది టక్కర్ హన్మంత్ రెడ్డి సరస్వతి మాత రాగి విగ్రహం అందజేసి శాలువాతో జడ్జిని సన్మానించారు.

జిల్లాకు చేరిన ఐద్వా బస్సు యాత్ర

నిజామాబాద్ సిటీ: ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్సు యాత్ర జిల్లాకు చేరింది. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని నాందేవాడ సీపీఎం కార్యాలయానికి వచ్చింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. ఈ బస్సు యాత్ర ముఖ్య ఉద్దేశం మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడమేనన్నారు. అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు, పెన్షన్ల కోసం పోరాటాలు చేయాలన్నారు. పులే, అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు అరుణజ్యోతి, ఆశలత, సాయిలీలతోపాటు జిల్లా నాయకులు సుజాత, అనిత, రజియా, మాధవి, కళావతి, స్వప్న పాల్గొన్నారు.

పూర్తయ్యేనా.. శిథిలావస్థకు చేరేనా?

- ఇరవై ఏళ్ల క్రితం కూరగాయల మార్కెట్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం
- ఇప్పటికీ అసంపూర్తిగానే నిర్మాణం
- బాల్కొండ మండల కేంద్రంలోని షెడ్డు దుస్థితి



బాల్కొండ మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ షెడ్డు నిర్మాణం

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన కూరగాయల మార్కెట్ షెడ్డు నిర్మాణం పూర్తయ్యేలోగా శిథిలావస్థకు చేరేలా ఉంది. ఇరవై ఏళ్ల క్రితం ప్రారంభమైన పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో మండల కేంద్రంలో కూరగాయల విక్రయాలు రోడ్డు పక్కన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండల కేంద్రంలో 1994లో అప్పటి సర్పంచ్ జీపీలో మిగులు బడ్జెట్‌తో కూరగాయల మార్కెట్ షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పునాది పూర్తి చేసి, షెడ్డు నిర్మాణం కోసం పిల్లర్లు వేసి బడ్జెట్ లేకపోవడంతో వదిలేశారు. అప్పటి నుంచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అలానే ఉంది. కాని పూర్తి చేయటానికి ఎవరూ శ్రద్ధ చూపలేదు. ఫలితంగా రెండు దశాబ్దాలు గడిచినా అసంపూర్తిగానే ఉంది. పాలకులు స్పందించి వెంటనే షెడ్డు నిర్మాణం పూర్తి చేయాలని మండల కేంద్ర వాసులు కోరుతున్నారు.



రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

రోడ్ల పక్కన విక్రయాలు..

బాల్కొండ పరిస్థితి ఊరు గొప్ప పేరు దిబ్బ అన్నట్లుగానే ఉంది. మండల కేంద్రంలో కనీసం కూరగాయలు క్రయ విక్రయాలు జరుపుకునేందుకు మార్కెట్ లేదు. దీంతో బస్టాండ్ సమీపంలో, ఉన్నత పాఠశాల సమీపంలో, రోడ్డు పక్కన నిత్యం కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. రోడ్డు పక్కన దుమ్ము.. ధూళితో ప్రజలు సతమతమవుతున్నారు. మార్కెట్ షెడ్డు పూర్తి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. తగిన బడ్జెట్ కేటాయించి వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బందిగా ఉంటుంది..

మార్కెట్ షెడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రోడ్డు పక్కన, తోపుడు బండ్లపై తిరుగుతూ కూరగాయలను విక్రయిస్తున్నాం. దీంతో తీవ్ర ఇబ్బందిగా ఉంది. మార్కెట్ షెడ్డును వెంటనే నిర్మించాలి.

– నజీర్, కూరగాయల వ్యాపారి, బాల్కొండ

బడ్జెట్ కేటాయించాలి..

మండల కేంద్రంలో జీపీ ఎదురుగా నిర్మించిన కూరగాయాల మార్కెట్ షెడ్డు నిర్మాణం కోసం బడ్జెట్ కేటాయించాలి. మార్కెట్ లేకపోవడంతో రోడ్డు పక్కన దుమ్ము, ధూళి సోకిన కూరగాయలను కొంటున్నాం.

– రాజేందర్, స్థానికుడు, బాల్కొండ

ముగిసిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



సాలంపాడ్ క్యాంప్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్: ఏఐసీసీ పిలుపు మేరకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సాలూర మండల పరిధిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఆఖరి రోజు మండలంలోని సాలంపాడ్, సాలంపాడ్ క్యాంప్, కుమ్మన్‌పల్లి గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య పాలనకు దిక్సూచి అయిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. ఏఎంసీ ఇన్‌చార్జి చైర్మన్ చీల శంకర్, బోధన్, సాలూర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, సాలంపాడ్ సొసైటీ చైర్మన్ గునపాటి బ్రహ్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఆవుల బాలకృష్ణారెడ్డి, నాయకులు నరేందర్ రెడ్డి, అల్లె రమేష్, చిద్రపు అశోక్, శ్రీనివాస్‌రావు(సాలూర క్యాంప్ మాజీ సర్పంచ్), ఆవుల పద్మారెడ్డి, కోట నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాలంపాడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



ఆర్మూర్: పట్టణంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎల్ఎస్ ఆగ్రో సీడ్స్ కంపెనీలో సిబ్బందికి అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతల గురించి వివరించారు. అనంతరం వారోత్సవాల సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను అందజేశారు. ఎస్ఎల్ఎస్ ఆగ్రో సీడ్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

చేతి నిండా పని కల్పించాలి



నందిపేట్(ఆర్మూర్): ఉపాధి హామీ కూలీలకు చేతి నిండా పని కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కె.గంగాధర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.గంగాధర్ మాట్లాడుతూ.. పని దినాలు తక్కువ చేయడం వల్ల అనేక మంది పేదవారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పాత పద్ధతి మాదిరిగా చెరువులో మట్టి తీయడం, ముళ్ల పొదలు తొలగించడం, కాలువలలో పూడికతీత లాంటి పనులు చేపట్టాలని కోరారు.

రాజకీయాల కోసం అంబేడ్కర్‌ను వాడుకుంటారా..?



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మోర్తాడ్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను వాడుకోవడం శోచనీయమని బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు కోరం ప్రకాష్ అన్నారు. శుక్రవారం మోర్తాడ్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల అంబేడ్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆ మహనీయుడి విగ్రహాన్ని శుద్ధి చేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకులు శుద్ధి చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఏనాడైనా అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారా అని ప్రశ్నించారు. నాయకులు పుప్పాల నరేష్, జైడి చిన్నారెడ్డి, మురళిగౌడ్, జైడి గంగారెడ్డి, శివానంద్, చిన్న నర్సయ్య, భోగ దేవేందర్, వినాయక్‌రెడ్డి పాల్గొన్నారు.

మొరం వేసి చదును చేశారు



కల్వర్టు వద్ద మొరం వేసిన తర్వాత..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో కొత్తపల్లి రోడ్డు మూల మలుపు పక్కన గల కల్వర్టు కూలిపోయి ప్రమాదకరంగా మారడంతో 'ప్రమాదకరంగా మూల మలుపు' అనే శీర్షికతో 'సాక్షి' గత ఆదివారం వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు కల్వర్టు వద్ద మొరం వేసి చదును చేశారు. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి–44పై అండర్ వేబ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టడంతో వాహనాల మళ్లింపు ఈ రోడ్డు గుండానే చేపట్టారు. చదును చేయడంపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ



నల్లూర్‌లో ప్రొసీడింగ్ కాపీని అందజేస్తున్న బీజేపీ నేతలు

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో నాయకపోడు సంఘం భవన నిర్మాణం కోసం ఎంపీ నిధులు రూ.4 లక్షలు మంజూరు కావడంతో శుక్రవారం భవన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీని బీజేపీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య, సంఘం పెద్ద మనుషులు పాల్గొన్నారు.

కత్తుల మల్లన్న ఆలయ పునర్నిర్మాణానికి...

బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో కత్తుల మల్లన్న ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆధ్యాత్మికం..

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న అనూప్‌రెడ్డి తదితరులు

మోర్తాడ్: మండలంలోని ధర్మోరాలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, విగ్రహాలకు అభిషేకం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణ దాత ముస్కు అనూప్‌రెడ్డి కుటుంబ సభ్యులు, వీడీసీ సభ్యులు, నిజామాబాద్ మాజీ మేయర్ ఆకుల సుజాత, నాయకులు శ్రీశైలం, కేఆర్ రవీందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, విశ్వహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాశరథి పురస్కారానికి ప్రేమ్‌లాల్ ఎంపిక

నిజామాబాద్ రూరల్: జిల్లాకు చెందిన కవి, ఉపాధ్యాయుడు ప్రేమ్‌లాల్ ప్రతిష్టాత్మక దాశరథి పురస్కారానికి ఎంపికయ్యాడని సాహిత్య రంగంలో ఆయన చేస్తున్న కృషిని గుర్తించి దశరథి ఆర్గనైజేషన్ కన్వీనర్ సతీష్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మే 1న హైదరాబాద్‌లో పురస్కార ప్రదాన కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా కవులతో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఘనంగా హన్మాన్ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



నందిపేట్(ఆర్మూర్): లక్కంపల్లిలో వీరహన్మాన్ భారీ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తులు, గ్రామస్తులు మూలవిరాట్టు విగ్రహాలను ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేపట్టారు. అన్నదానం నిర్వహించారు. విగ్రహ దాతలు ప్రసాద్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు హన్మాన్ చాలీసా సామూహిక పారాయణం

రుద్రూర్: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఉదయం 8 గంటలకు శ్రీ రామరక్ష స్తోత్రం హన్మాన్ చాలీసా సామూహిక పారాయణం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు చిదుర వీరేశం తెలిపారు. పారాయణం తరువాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తారని, హుండీ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని వివరించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



పడగల్ చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు



దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ ప్రేమ్‌రాజ్

వేల్పూర్: మండల పరిధిలోని పలు గ్రామాల చర్చిలలో శుక్రవారం క్రైస్తవులు గుడ్‌ఫ్రైడే భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పడగల్, వేల్పూర్, మోతె, అంక్సాపూర్, జాన్కంపేట్, పచ్చలనడ్కుడ, అక్లూర్, వెంకటాపూర్, అమీనాపూర్, రామన్నపేట్ గ్రామాలలోని వివిధ చర్చిలలో జీసస్ మరణంపై ప్రత్యేక పాటలు పాడారు. జీసస్ సిలువపై పలికిన ఏడు మాటల సారాంశాన్ని పాస్టర్లు చదివి వినిపించారు. పడగల్ సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ప్రేమ్‌రాజ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో చర్చిల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటల గురించి పాస్టర్లు వివరించారు. భక్తులకు ప్రత్యేక దీవెనలు అందించారు.



దూదిగాం సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ఆంధ్రానగర్‌లో చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఏర్గట్ల మండల కేంద్రంలో..

నందిపేట్(ఆర్మూర్): ఆంధ్రానగర్, కౌల్‌పూర్ గ్రామాలలో పలువురు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆంధ్రానగర్ గ్రామానికి చెందిన బండి నాగరాణికి రూ.60 వేలు, నడిశెరం రాజన్నకు రూ.17 వేలు, బగ్గల్ రవికి రూ.34 వేలు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు బాధిత కుటుంబాలకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు గొజ్జి రాజేందర్, అడవి రాము, తదితరులు కలిసి చెక్కులను అందజేశారు.

ఏర్గట్ల మండల కేంద్రంలో..

మోర్తాడ్: ఏర్గట్ల మండల కేంద్రంలోని నలుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఆరోగ్యం బాగాలేక మెరుగైన వైద్యం చేయించుకున్న నలుగురికి రూ.2.20 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిలు మంజూరు చేయించిన చెక్కులను నాయకులు పంపిణీ చేశారు.

నల్లూర్‌లో..

బాల్కొండ: ముప్కాల్ మండలం నల్లూర్‌లో ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈసందర్భంగా మంజూరుకు కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్ అశోక్ తెలిపారు. నందిపేట్, మాక్లూర్, నవీపేట్ మండలాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణం 132/33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పెర్కిట్, ఆర్మూర్, అంకాపూర్, ఇస్సాపల్లి, ఆలూర్, మామిడిపల్లి, ఫత్తేపూర్, గోవింద్‌పేట్, లక్కోర, చేపూర్, పిప్రి, మగ్గిడి, సుర్బిర్యాల్, కోమన్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అన్నారు.

వర్నిలో భూభారతిపై అవగాహన సదస్సు

వర్ని: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతిపై ఈనెల 19న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వర్ని తహసీల్దార్ సాయిలు వెల్లడించారు. అవగాహన సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్మూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

ఆర్మూర్: పట్టణంలోని వివిధ వార్డుల్లో శనివారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి పర్యటించనున్నారు. పట్టణంలోని 4వ, 24వ, 26, 27వ, 35వ, 33వ, 13వ వార్డుల్లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటిస్తారని బీజేపీ నాయకులు తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం ఉంటుందని బీజేపీ నాయకులు తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వర్ని: మండలంలోని పాత వర్ని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మజ వెల్లడించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో ప్రథమ సంవత్సరంలో బీఎస్సీ ఎంపీసీ, బీఎస్సీ ఎంపీసీఎస్, బీఎస్సీ ఎంఎస్సీఎస్, బీఎస్సీ బీజెడ్‌సీ, బీకాం సీఏ, బీఏ ఈపీహెచ్, బీఏ ఈపీ కోర్సులలో చేరికకు మే 5 వరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అక్రమ కేసులు పెట్టడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

బోధన్‌టౌన్(బోధన్) : నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై కేసులు పెట్టడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో నాయకులు తూము శరత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్ కుమార్, మైనార్టీ పట్టణ అధ్యక్షులు ఖలీం, నేతలు మీర్ నజీర్ అలీ, గుండేటి రాములు, కిశోర్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	మ్యాడ్‌స్క్వేర్(తెలుగు)-11.10, 7.45 -మధురం-1.55
	జాక్(తెలుగు)-4.50-డియర్ ఉమ-10.30
స్క్రీన్-2	ఓదెల-2-10.00, 1.05, 4.10, 7.15, 10.20
స్క్రీన్-3	జాక్(తెలుగు)-11.15, 8.40
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-2.10, 5.10
స్క్రీన్-4	అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి-10.30, 1.30, 4.30, 7.30,10.30



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	94,900	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	87,597		

– నిజామాబాద్ బిజినెస్